# ప్రతీకలు

కరీముల్లా



"శంకరం వీలు చూసుకుని ఒకసారి వినుకొండలోని చిన్నాన్న వాళ్లింటికి వెళ్లి రాకూడదు" అంది అమ్మ.

చదువుతున్న పేపర్లోంచి తల తిప్పి ఎందుకన్నట్లు చూశాను అమ్మవైపు.

"ఏం లేదు. నిన్న చాకలి సుబ్బడు ఊర్నుంచి వచ్చాడు. అక్కడ చిన్నాన్న వాళ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైందిట. కొట్లో నష్టాలొచ్చి పీకల్లోతు అప్పుల్లో మునిగారట. ఉన్న ఆస్తులు అయినకాడికి తెగనమ్మినా తీరని అప్పులు అయ్యాయిట!"

దానికి నేనేం చేయగలనన్నట్లు చూశాను అమ్మవైపు.

"జీతం రాళ్లతో ముడిపడ్డ జీవితం నీది. నీ ఆర్థిక స్థితి నాకు తెలియదా? కష్టాల్లో వున్నప్పుడు పలకరించి స్వాంతన చేకూర్చే వారే నిజమైన బంధువులు. నా ఆరోగ్యం సరిగా ఉన్నట్లయితే నేనే వెళ్లేదాన్ని. అందుకే రేపాదివారం నువ్వెళ్లి చిన్నాన్నను, చిన్నమ్మను పలకరించి రా. నిజానికి, అది మన బాధ్యత, ధర్మం కూడాను. అంతేకాదు, పెద్దకొడుకు ఇంటికి తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు. కుటుంబం ఇలా నిలువునా కష్టాల్లో కూరుకుపోయి వుంటే రామం బాధ్యతల్ని విస్మరించి అప్పులతో తనకేం సంబంధం లేదంటూ స్వార్థంతో భార్యాపిల్లల్ని తీసుకుని ఇల్లొదిలి వేరు కాపురం పెట్టుకున్నాడట. చిన్న వాడున్నాడంటే వాడికి బాధ్యతల్ని నెత్తిన వేసుకునే వయసు గాని, మానసిక పరిణతి గాని లేదు. చిన్నప్పట్నుంచి నీకు, రామానికి మంచి దోస్తీ. ఆ చనువుతోనైనా రామాన్ని తిరిగి ఇంటికి వచ్చి ఆపత్కాలంలో తండ్రికి వెన్నుదన్నుగా నిలబడమని నచ్చజెప్పు. నువ్వు చెబితే కాదనడనే నమ్మకం నాకుంది."

అమ్మ మాటకు సరేనన్నాను.

వినుకొండలో చిన్నాన్న వాళ్లది బంగారుపు కొట్టు. ఆర్డర్లపై రకరకాల బంగారు నగలు తయారు చేస్తారు. ఆభరణాలు చేసినందుకుగాను కొంత సొమ్ము మజూరి కింద తీసుకుంటారు. అయితే ఈ వ్యాపారంలో చిన్నాన్న ఇబ్బడి ముబ్బడిగా లాభాలార్జించక పోయినప్పటికీ నీతి, నిజాయితీ గల స్వర్ణకారుడిగా, మంచి మనిషిగా మాత్రం పేరుపొందాడు. చిన్నాన్న వాళ్లు కల్తీ లేకుండా నిక్కచ్చి బంగారంతో నగలు చేస్తారని ప్రతీతి. ఉన్నంతలో ఎవర్నీ దేహి అనకుండా, దేనికి లోటు రానీకుండా వచ్చే కొద్దిపాటి రాబడితోనే ఇప్పటివరకు ఆ కుటుంబానికి గౌరవంగానే జరిగిపోయింది. అలాంటిది ఉన్నట్లుండి ఇన్ని అప్పులు ఎలా అయ్యాయో అర్థం కాలేదు.

అమ్మకిచ్చిన మాట ప్రకారం మరుసటి ఆదివారం వినుకొండకు ప్రయాణమయ్యాను. స్టేషన్లో టిక్కెట్టు తీసుకుని రైలెక్కాను. రైలు కదలికతో చిన్ననాటి నా స్మృతుల తుట్టె చెదిరింది. జ్ఞాపకాలు ఒక్కసారి నా మస్తిష్కాన్ని ముప్పిరిగొన్నాయి.

వినుకొండ మా అమ్మమ్మ వాళ్ల ఊరు. మా తాతయ్య నూనె వ్యాపారం చేసేవాడు. వినుకొండ చుట్టుప్రక్కల గొందుల్లో సైకిలుపై తిరిగి నూనెను విక్రయించేవాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. ముగ్గురు కొడుకులు. మా నాయన ఆ ఇంటికి పెద్దల్లుడు. మా బంధువులంతా మా పట్ల అవ్యాజమైన ప్రేమాభిమానాలు చూపించేవారు. మా నాయిన పట్ల అందరూ భయభక్తులతో మెలగేవారు. ఒక్క తాతయ్య తప్ప! మేం కూడా వాళ్ల పట్ల అంతే

ఆప్యాయత చూపే వాళ్లం.

సెలవులకు, పండుగ పబ్బాలకు రమ్మని తాతగారింటి నుంచి మాకు పిలుపు వచ్చేది. అప్పుడు మా కుటుంబమంతా ఇలు తీర్థం వెళ్లినట్లుగా వెళ్లేవాళ్లం. చిన్నపిల్లలమైన మాకు ఆటవిడుపులా ఉండేది. అక్కడ ఉన్నన్నాళ్లు మా ఆనందానికి మేరలుండేవి కావు.

నేను, రామం తెగ తిరిగే వాళ్లం. పొద్దున్నే అమ్మమ్మ పెట్టిన చద్ది ఇంత తిని, ఇచ్చిన తాయిలాల్ని జేబులో దోపుకుని మా ఆటల స్థావరమైన గుంటి ఆంజనేయస్వామి గుడి వద్దకు వెళ్లేవాళ్లం. భక్తుల రాకపోకలు అంతగా లేకపోవడంతో అక్కడ మేం రకరకాల ఆటలు ఆడుకునే వాళ్లం. చెట్లెక్కేవాళ్లం. గుడి వెనుక గుడికి గొడుగు పట్టినట్లుండే మర్రిచెట్టు ఊడలు పట్టుకుని ఊయలలూగే వాళ్లం. కోనేట్లోకి దిగి సేద తీరే వరకు ఈతలు కొట్టే వాళ్లం.

గుడి సత్రంలో సాధువులుండేవారు. వాళ్ల వేషధారణ మాకు విచిత్రంగా కన్పించేది. బవిరి గడ్డం, జటాజూటం, కాషాయ వస్త్రధారణ, నుదుటి పైన, మోచేతుల పైన తెల్లటి విభూది పట్టీలు, మెళ్లో రుద్రాక్షలు... వాళ్లు మాకు దైవాంశ సంభూతులుగా కన్పించేవారు. వాళ్లకు మహిమలు తెలుసునని రామం చెప్పేవాడు. వాళ్లు మా నుదుటిన విభూతితో బొట్టుపెట్టి "దీర్ఘాయుష్మాన్ భవ!" అంటూ దీవించే వాళ్లు.

అలా ఆడుకుంటూ ఆడుకుంటూ ఎప్పటికో ఇంటికి చేరుకునే వాళ్లం. "ఇంతసేపు ఎక్కడికెళ్లార్రా?" అంటూ అమ్మమ్మ చివాట్లు పెట్టేది.

రాత్రుళ్లు ఆరుబైట వెన్నెల్లో పెద్దలందరితో కలిసి మాట్లాడుకుంటూ సహపంక్తి భోజనాలు చేసే వాళ్లం. భోజనాలు చేసేటప్పుడు (పెద్దవాళ్లు ఒకళ్లనొకళ్లు సరదాగా ఆటపట్టించుకునేవాళ్లు) ఆ ఇంటి కొడుకులు, కూతుళ్లు ఒక జట్టుగా, అల్లుళ్లు, కోడళ్లు ఒక జట్టుగా మారి సరదాగా ఆటపట్టించుకునే వాళ్లు.

ఆ రోజులే వేరు... ఆ మనుషులే వేరు... ఊళ్లల్లో ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కన్నులపండువగా కన్పించేవి. ఇళ్లన్నీ మనుషులతో కళకళలాడుతూ, ప్రతిరోజూ పండుగ రోజులా గడిచేది. ఎవరూ ఎవర్ని పేరుపెట్టి పిలుచుకునే వాళ్లు కాదు. ప్రతి ఒక్కరినీ ఏదో ఒక వరుసతో పలకరించుకునేవాళ్లు. మనుషుల్లో ప్రేమ, ఆప్యాయతలు వెల్లివిరిసేవి. పైకొకటిగాను, లోపలొకటిగాను ప్రవర్తించడం ఆనాటి మనుషులకి చేతనయ్యేది కాదు. మనసుల్లో కుట్రలకు, కుతంత్రాలకు చోటుండేది కాదు. రాగద్వేషాల కతీతంగా ఒకరి సుఖదుఃఖాలను అందరూ పంచుకునేవారు. నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యముండేది. విలువలతో కూడిన జీవితం గడపటం ఆనాటి జీవన విధానంగా ఉండేది. కంటికి కన్పించని ఏదో అద్వితీయమైన మానవీయ బంధం ఆనాటి మనుషుల్ని కలిపి ఉంచేది. నాకెందుకో అదంతా సత్యకాలంగా తోచేది.

వినుకొండ స్టేషను రావడంతో ఆలోచనలు చెదిరి ప్రస్తుతానికొచ్చాను.

రైలు దిగి నేరుగా చిన్నాన్న వాళ్లింటికి వెళ్లాను. నే వెళ్లేసరికి చిన్నాన్న వసారాలోని అరుగు మీద ఒంటరిగా కూర్చుని ఉన్నాడు.

చిన్నాన్నను చూడగానే నా గుండె చెదిరిపోయింది. మానసికంగా పెద్ద దెబ్బ తగిలినట్లు కన్పించాడు. ఒకప్పుడు పచ్చగా కళకళలాడుతూ పదిమందికీ నీడనిచ్చి, ఇప్పుడు ఎండు మోడుగా మారిన చెట్టల్లే కన్పించాడు చిన్నాన్న. బతుకు ప్రయాణంలో అలసిపోయిన బాటసారల్లే కన్పించాడు చిన్నాన్న.

నన్ను చూడగానే "ఎప్పుడొచ్చావురా శంకరం?" అన్నాడు.

"ఇదే రావడం" అన్నాను.

నా గొంతు విని చిన్నమ్మ ఇంట్లోంచి బైటికి వచ్చింది. చిన్నమ్మను చూడగానే నా కడుపు తరుక్కుపోయింది. జీవచ్ఛవంలా ఉంది చిన్నమ్మ.

"నాయనా శంకరం బాగున్నావా? ఇంటి దగ్గర అందరూ బాగున్నారా? అమ్మ ఆరోగ్యం ఎలా వుంది? సుభద్ర బాగుందా? నీ బిడ్డ బడికెళ్తోందా?" అంటూ కుశల ప్రశ్నల వర్షం కురిపించింది చిన్నమ్మ.

అందరూ బాగానే ఉన్నారని చెప్పాను. వంటింట్లో ఏదో అలికిడయితే ఇంట్లోకి వెళ్లిపోయింది.

"ఇలా ఎలా జరిగింది?" అడిగాను చిన్నాన్నను.

"ఎలా ఏముందిరా శంకరం! ఒకప్పుడు వ్యాపారం ఏ ఒడిదుడుకు ల్లేకుండా సమాంతరంగా సాగిపోయేది. దాన్ని బట్టే మా జీవితాలు సాఫీగా గడచిపోయాయి. మరి ఇపుడో వ్యాపారంలో ఆటుపోట్లు ఎక్కువయ్యాయి. కాలం గడిచేకొద్దీ స్వర్ణకారుల పరిస్థితి దుర్భరంగా తయారైంది.

జాతీయంగా, అంతర్జాతీయంగా జరిగే ఉపద్రవాలు వ్యాపారంపైన ప్రభావం చూపేవి. ఎక్కడో ఏదో దేశం మీద ఏదో దేశంవాడు దురాక్రమణ చేసినా... మన దేశ సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకున్నా... దేశం లోపల ఉగ్రవాద ముష్కరులు విద్రోహ చర్యలు తలపెట్టినా... కుటిల రాజకీయ నాయకులు తమ స్వార్థపూరిత లక్ష్యాల కోసం ప్రభుత్వాల్ని కూలదోసినా... ఈ పరిణామాలన్నీ మార్కెట్లోని బంగారంపై తీవ్ర ప్రభావం చూపేవి. దాంతో పసిడి ధర విపరీతంగా పెరిగిపోయేది.

వినియోగదారులకి మాత్రం ఈ పరిణామాలతో నిమిత్తం లేదు. అతడు మనతో ఏ రేటు ప్రకారం ఒప్పందం చేసుకుంటాడో, ఆ రేటు ప్రకారం నగలు చేసివ్వాలి. ఆ నష్టాన్ని మనమే భరించాల్సి వచ్చేది. నష్టాలు పూడ్చుకునేందుకు అప్పులు చేయాల్సి వచ్చేది. కాలం గడిచేకొద్దీ వడ్డీలు పెరిగి అప్పులు రెట్టింపయ్యేవి.

ఇవన్నీ ఒక ఎత్తయితే, కష్టకాలంలో ఏడుగడలా ఆధారమవుతాడనుకున్న కొడుకు మా చావు మమ్మల్ని చావమని తన దారి తను చూసుకుని కోలుకోలేని దెబ్బ కొట్టాడురా!"

చివరి మాటలు చెబుతున్నప్పుడు చిన్నాన్న గొంతు గద్గదికం అయ్యింది.

"నువ్వు నమ్ము నమ్మకపో శంకరం! ఇంత అప్పులు కూడా ఒక్క పైసా నా స్వంతానికి చేసుకుంది లేదు. అంతా కుటుంబం కోసమే చేశాను. ఇన్ని అప్పులు, బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో చేసిందే కాని బాధ్యతారాహిత్యంగా చేసింది కాదు. బాగా జరుగుతున్న దినాల్లో మాతో కలసి వుండి, జరుగని దినాల్లో మమ్మల్ని విడిచి వెళ్లడం ఏం న్యాయంరా శంకరం? వాడిలా నేను నా స్వార్థం చూసుకున్నట్లయితే వాళ్ల జీవితాలు ఇలా ఉండేవా?

నీకు తెలుసో తెలియదో శంకరం! నాకు పన్నెండేళ్ల వయస్సప్పుడు మా అమ్మ చచ్చిపోయిన నెల రోజులకు గావాల్ను ఒకరోజు రాత్రి మా నాయిన నన్ను నిద్దర లేపి, తన కూడా తెచ్చిన ఒకామెను చూపించి నాకు అమ్మవుతుందని చెప్పాడు. నేనేం మాట్లాడలేదు. ఆయనకు ఎదురు చెప్పింది లేదు. ఆమెను అమ్మగానే స్వీకరించాను. ఆనాటి నుంచి కుటుంబ భారం నా నెత్తిన పడ్డది. కుటుంబాన్ని పోషించడం చేతకాకున్నా నల్గురు చెల్లెళ్లను నాకు ప్రసాదించి మా నాయిన తన మగతనాన్ని నిరూపించుకున్నాడు. వాళ్లందర్నీ సొంత చెల్లెళ్లుగానే ఆదరించాను. నా రెక్కల కష్టంతోనే అందర్నీ పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేశాను. ఆనాడు కూడా అది నా బాధ్యత అనుకుని చేశాను గానీ సమస్యలకు భయపడి స్వార్థంతో నా దారి నేను చూసుకుంది లేదు."

చిన్నాన్న చెప్పిన మాటలు అక్షరాలా నిజం. ఇదంతా నాకు అమ్మ ద్వారా తెలుసు.

చిన్నాన్న చెబుతూనే ఉన్నాడు.

"జీవితంలో ఇప్పటివరకు మాట తప్పింది లేదు. ఇకముందు కూడా తప్పేది రాదు. ఎవరికీ ఒక్క పైసా ఎగ్గొట్టేది లేదు. ఎలాగైనా సరే అందరి అప్పులు తీర్చేయాలి. చిన్నాడికి ఒక దారి చేయాలి. ఇవన్నీ చేయగలనన్న ధైర్యమయితే ఉంది గానీ ఈలోపు ముదిమి పైబడి మృత్యువు ముంచుకొచ్చి సమాజం ముందు మాట తప్పిన వాణ్ణి అవుతానేమోనని భయంగా ఉందిరా!"

ఒక్కసారి పెద్ద విస్ఫోటనం జరిగినట్టు చిన్నాన్న గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది. దుఃఖాన్ని ఆపుకోవడం చిన్నాన్నకు సాధ్యం కాలేదు. చిన్నపిల్లాడిలా రోదించాడు.

పులిలాంటి చిన్నాన్న భీరువులా మారి విలపించడం చూసి నా గుండెలు ద్రవించాయి. శాసించిన ఆ కళ్లు వర్షించడం చూసి అప్రయత్నంగా నా కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి.

"ఊరుకో చిన్నాన్నా ఊరుకో! కష్టాలు కలకాలం ఉండవులే!" అంటూ చిన్నాన్నను ఓదార్చే ప్రయత్నం చేశాను.

చిన్నాన్న తేరుకోవడానికి కొంచెంసేపు పట్టింది. మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం పరుచుకుంది.

"రామం ఉండేదెక్కడ?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగాను.

దూరంగా ఆడుకుంటున్న పదేళ్ల పిల్లాడిని పిలిచి రామం మావయ్య ఇల్లు చూపించమని చెప్పాడు.

చిన్నాన్న దగ్గర సెలవు తీసుకుని అక్కడ్నుంచి లేచి ఆ పిల్లాడిని అనుసరించాను.

రామాన్ని కలిసి ఎలాగైనా సరే నచ్చజెప్పి తిరిగి ఆ తండ్రీకొడుకుల్ని కలపాలని నిశ్చయంగా అనుకున్నాను.

మెరక బజారులో దర్గా వీధిలో ఉంటున్న రామం ఇల్లు చూపించి ఆ కుర్రాడు వెనక్కి వెళ్లిపోయాడు. నే వెళ్లేసరికి రామం ఇంట్లో లేడు. రామం భార్య సీత నన్ను పలకరించి కాళ్లు కడుక్కోవటానికి నీళ్లిచ్చింది.

భోంచేయమంది. ఆకలిగా లేదన్నాను. మేమిద్దరం అలా మాటల్లో వుండగానే రామం వచ్చాడు. వస్తూనే "ఏరా శంకరం! ఇదేనా రావడం?" అన్నాడు.

"ఊర్నుంచి వచ్చి గంటసేపయ్యింది. ఇక్కడకొచ్చి

పది నిముషాలైంది" అని చెప్పాను.

"అమ్మ వాళ్లింటికి వెళ్తున్నావా?" అని అడిగాడు రామం.

అవునన్నట్లు తలూపాను. కుశల ప్రశ్నలయ్యాయి. చల్లకొచ్చి ముంత దాచడమెందుకు? మాటల్లో కుటుంబ పరిస్థితి గురించి నేనే ప్రస్తావించాను.

చిన్నాన్న మీద రామం నిప్పులు కక్కాడు. చిన్నాన్నను దుర్భాషలాడాడు. కొట్లో నష్టాలొచ్చి అప్పులపాలవడానికి కారణం చిన్నాన్నే అన్నాడు.

"సమాజం ఎలా వుందిరా శంకరం? దాన్ని బట్టి మనమూ పోవాలి. నీతి, నిజాయితీ అంటూ మడికట్టుకు కూర్చుంటే ఏటికి ఎదురీదడమే అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మోసం చేయగలగడం తెలివితేటలకు చిహ్నంగానూ, నిజాయితీగా ఉండటం అసమర్ధతకు నిదర్శనంగానూ మారిపోయాయి. అలాంటపుడు ఎవడిక్కావాలయ్యా ఈ నీతి నిజాయితీ?

వ్యాపారం అంటే నమ్మకం. నమ్మకం పునాదుల మీదే వ్యాపారం ఆధారపడి ఉంటుంది. ఇది ఒకప్పటి సిద్ధాంతం. ఇప్పుడా సిద్ధాంతం మారిపోయింది. వ్యాపారం అంటే దగా, మోసం... వినియోగదారుణ్ణి ఎంతగా మోసం చేయగలిగితే అంతగా వ్యాపారం అభివృద్ధి చెందుతుంది.

బంగారంలో కల్తీ కలపవయ్యా అంటే ప్రాణం పోయినా ఆ పని చేయనంటివి. మా కంటె వెనుక వ్యాపారంలో దిగిన వాళ్లు మమ్మల్ని ఓవర్‌టేక్ చేసి ముందుకెళ్లి లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు. నువ్వు మాత్రం నీతి-నిజాయితీ అంటూ మా చేతులు కట్టేస్తివి. కేవలం మజూరి సొమ్ముతో మా బతుకులు ఎన్నాళ్లకు బాగుపడాలి?

అయినా ఈ రోజుల్లో డబ్బు గడించడమే ముఖ్యం. ఎలా గడించామన్నది ముఖ్యం కాదు. పోనీ, నీ మంచితనం చూసి అప్పులవాళ్లు డబ్బులు అడక్కుండా ఉంటారా? లేదే? మరలాంటప్పుడు ఎందుకీ ఆదర్శాలు?"

రామం చెప్పడం ఆపాడు.

రామం మాటలు నన్ను తీవ్ర విస్మయానికి గురి చేశాయి. రామాన్ని చూసి చిన్ననాటి నా రామమేనా అన్పించింది. చిన్నప్పుడు తాతయ్య దగ్గర ఎన్నో నీతి కథల్ని విన్నాం. సత్యవాక్కు కోసం రాజ్యాన్ని తుదకు ఆలుబిడ్డల్ని సైతం కోల్పోయిన హరిశ్చంద్ర మహారాజు కథల్ని, "సత్యంతో శోధనే నా జీవితం" అన్న జాతిపిత మహాత్మాగాంధీ జీవిత గాథల్ని పాఠాల్లో చదువుకున్నాం. ఆ కథలు, గాథలు మాపై విపరీతమైన ప్రభావాన్ని చూపించేవి. గంటల తరబడి ఆ కథల గురించి, ఆ మహనీయుల గురించి చర్చించుకునే వాళ్లం.

జీవితంలో ఎన్నడూ అసత్యమాడరాదని, పరుల్ని మోసం చేయకూడదని, ఎన్ని కష్ట నష్టాలెదురైనప్పటికీ నిజాయితీగానే బతకాలని ఇద్దరం ఆ చిన్ననాడే బాసలు చేసుకున్నాం.

అలాంటి రామం నోటివెంట మోసం, దగా అనే మాటలు రావడం చూసి ఆశ్చర్యమేసింది. నీతి, నిజాయితీ రామం దృష్టిలో చాదస్తంగా కన్పించడం చూసి నన్ను నేనే నమ్మలేకపోయాను.

రామం ఇప్పుడు నా కళ్లకు స్వార్థానికి నిలువెత్తు రూపంలా కన్పించాడు.

"చిన్నాన్న మాత్రం ఈ అప్పులు తన కోసం చేసుకున్నవి కాదు కదా! కుటుంబం కోసమే కదా చేసింది!" నచ్చజెప్పే ధోరణిలో రామంతో అన్నాను.

"తలకు మించిన అప్పులు ఎవరు చేయమన్నారు? ఎవర్నడిగి చేశాడు? అంత లేని రోజులే దాపురిస్తే తలా ఒక వీధికెళ్లి బిచ్చమెత్తుకునే వాళ్లం. ఇప్పుడీ అప్పులన్నీ ఎవరు తీరుస్తారు?"

స్వార్థ పూరితమైన రామం మాటలకు నేను నిరుత్తరుడనయ్యాను.

ఎలాగైనా రామాన్ని మార్చాలన్న నా ఆశ ఇంకా చావక "ఇలాంటి పరిస్థితుల్లో నువ్వు బాధ్యతల్ని విస్మరించి, ఇల్లు విడిచి వేరుగా వెళ్లడం న్యాయమేనా?" అన్నాను.

"అక్షరాలా న్యాయమే! బాధ్యత అనుకుని అక్కడే వుండి అప్పుల్ని నెత్తిన వేసుకుని నా భార్యాపిల్లలకు అన్యాయం చేయలేను. వాళ్ల భవిష్యత్తు కాలరాయలేను. పడవెక్కి నదిని దాటుతున్నప్పుడు పడవకు చిల్లు పడితే, నది పడవను ముంచేసేలోపు ఆ పడవనొదిలి సురక్షితమైన మరో పడవనెక్కడం వివేకవంతుల లక్షణం. అలాంటి సమయంలో న్యాయా న్యాయాలు విచక్షిస్తూ కూర్చుంటే పడవతోపాటు మనం కూడా మునిగిపోయే ప్రమాదం ఉంది. చివరిగా చెబుతున్నాను- నాకు నా కుటుంబమే ముఖ్యం. వాళ్ల బాధ్యతే నాకు ముఖ్యం!"

తెగేసి చెప్పడంతో రామంతో ఇంక మాట్లాడటం అనవసరమన్పించింది.

రామం మారిపోయాడు. పూర్తిగా మారిపోయాడు. రామంలోని అణువణువూ స్వార్ధంతో నిండిపోయింది. ఆ స్వార్థం ముందు అందరూ బలాదూర్! రామానికి ఇప్పుడు ఎవరూ అక్కర్లేదు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, రక్తం పంచుకు పుట్టినవాళ్లు ఎవరూ అక్కర్లేదు.

రామం ఇప్పుడు స్వార్థ జీవి.

ఇక అక్కడ ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు. లేచాను. వెళ్తానన్నాను. ఉండమన్నాడు. అర్జంటు పని వుందని చెప్పి రామం ఇంటి నుండి బైటపడ్డాను.

భారంగా అడుగులు వేసుకుంటూ స్టేషను వైపు నడిచాను. రామం మారిపోయాడన్న బాధ గుండెల్ని మెలిపెడుతోంది. ఏదో నిరాశ, నిస్పృహ మనస్సును కమ్మేస్తోంది. నిస్సత్తువ శరీరాన్ని ఆవహించి నడవనీకుండా చేస్తోంది. నెమ్మదిగా నడుస్తున్నాను. అలా ఎంతసేపు నడిచానో స్టేషనుకు చేరుకున్నాను. టిక్కెట్టు తీసుకుని ఒకచోట కూర్చున్నాను. మరో పది నిముషాల తర్వాత రైలొచ్చింది. ఎక్కి కూర్చున్నాను. ఆలోచనలు... ఏవో ఆలోచనలు...

కాలం మారింది. కాలంతోపాటు మనుషులు మారారు. మనస్తత్వాలు మారాయి. ఈ మార్పులు ముఖ్యంగా మానవ సంబంధాల మీద దారుణమైన దెబ్బకొట్టాయి. ఇప్పుడు మనుషుల్ని కలిపి ఉంచుతున్నది ఆర్థిక సంబంధాలే! మనుషుల్లో స్వార్థం ప్రబలింది. ప్రేమ, ఆప్యాయతలు ఆవిరైపోయాయి. మనిషి ఆర్థికంగా బలోపేతం అయ్యేకొద్దీ మనిషిగా కుంచించుకుపోతున్నాడు. 'నా' అనే తత్వం మనిషిని మనిషికి కాకుండా చేస్తుంది. తండ్రీకొడుకుల్ని, అన్నదమ్ముల్ని వేరు చేస్తుంది. జీవన విధానం కూడా గతి తప్పింది. మోసం చేసి బతకటం నేటి జీవన విధానం అయిపోయింది. నైతిక విలువలు దుర్భిణి వేసి వెతికినా కన్పించవు. ఒకవేళ ఎవరైనా నైతిక వర్తనంతో జీవిస్తుంటే అలాంటి వాడిని వెర్రిబాగులోడి కింద జమకట్టే స్థాయికి సమాజం పతనం చెందింది.

నాకెందుకో చిన్నాన్న గడిచిపోయిన ఆ మంచి కాలానికి ప్రతీకగానూ, రామం మారిన నేటి ఈ పాడు కాలానికి ప్రతీకగానూ కన్పించారు.

రైలు కదిలింది.

●

## ఆనందం

బాల్యానికి
వృద్ధాప్యానికి
ప్రత్యేక వరం
'బోసి' నవ్వు.

## యదార్థం

మొదటి రాత్రి
ఆలి రూపాన్ని
చచ్చే పర్యంతం
గుండెల్లో నిలుపుకుని
రమించిన
నాథుడే
నిజమైన
రసికుడు!

## లోటు

దేశం
నలుమూలల్లో
పురిటి వాసన
ఆగనంతకాలం
జనాభాకేం లోటు
సాపాటుకి తప్ప!

## కల

ధనం పోగేసి
దాచేసుకున్న
పిసినారి-
నదులు ఏరుల్లోని
ఉదకాన్ని నింపుకున్న
సముద్రం-
ఎండమావులు!

- మాధవరపు కృష్ణ